క్లుప్తంగా

నేడు ఐలవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

భట్టిప్రోలు: ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల (గూడవల్లి) సౌజన్యంతో గురువారం భట్టిప్రోలు మండలం ఐలవరం పద్మశాలీయ కల్యాణ మండపంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరంలో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి నేత్ర పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శుక్లాలు, కంటి పొరలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్, ఫోన్ నంబర్‌తో శిబిరానికి హాజరు కావాలని కోరారు.

22న అర్చకుల అవగాహన సదస్సు

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 22వ తేదీన రేపల్లె డివిజన్ అర్చక సేవా సంఘం ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అర్చకులకు అవగాహన సదస్సు నిర్వహించబడునని సంఘం ప్రధాన కార్యదర్శి దీవి రాజగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు డివిజన్ పరిధిలోని అర్చకులు హాజరుకావాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్లు అందజేత

పేరలి(కర్లపాలెం): క్రీస్తు మార్గం అనుసరణీయమైనదని వీరాస్వామి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.వందనం తెలిపారు. పేరలి గ్రామంలో వీరాస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించి వృద్ధ మహిళలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా వందనం మాట్లాడుతూ అందరూ క్రీస్తు మార్గంలో పయనిస్తూ సాటివారి పట్ల దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ సామేల్, ప్రముఖ రంగస్థల నటులు పుష్పలత, జానీ అనిల్, వినోద్, మేషక్, స్వాతి తదితరులు ఉన్నారు.

పెన్షనర్‌లకు సత్కారం



రేపల్లె రూరల్: జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు అడుసుమల్లి ఝాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో రైలుపేటలో రిటైర్డ్ ఉద్యోగులకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌లో మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఉల్లంగుంట వెంకటేశ్వరరావు, డ్రైనేజీ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ఉద్యోగి షేక్ బషీర్ అహమ్మద్, రిటైర్ టీచర్ అడుసుమల్లి భీమశంకరరావులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డ్రైనేజ్ డిపార్ట్‌మెంట్ సీనియర్ అసిస్టెంట్ కన్నా నటరాజ్, ఉపాధ్యాయులు కృష్ణవేణి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మినుము, పెసర పంటలకు విత్తన శుద్ధి చేయాలి



అమర్తలూరు(వేమూరు): రబీ సీజన్‌లో పెసర, మినుము పంటలు సాగు చేసే రైతులు విత్తన శుద్ధి చేయడం వల్ల రసం పీల్చే పురుగుల బారి నుంచి 20 రోజుల వరకు పంటను సంరక్షించుకోవచ్చని బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మి అన్నారు. అమర్తలూరు మండలంలోని తురిమిళ్ల, ఇంటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాగాణి అపరాల సాగులో ప్రధాన సమస్య అయిన కలుపును నివారించేందుకు విత్తిన వెంటనే పెండిమిథాలిన్ ఎకరానికి ఒక లీటరు చొప్పున లేదా నాటిన 20–25 రోజుల సమయంలో ఇమాజిత్ పిర్ మందు 400 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. రెండు రోజులు జల్లులు పడే అవకాశం ఉన్నందున రైతులు కోసిన ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి, ఏఈఓ శ్రీకాంత్, వీఏఏలు భాస్కర్, భార్గవి, మణికంఠ, రైతులు పాల్గొన్నారు.

22 నుంచి యోగ శిబిరం

తెనాలిఅర్బన్: శ్రీఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఉచిత యోగ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యోగ గురువు తాడికొండ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బోసురోడ్డులోని శ్రీకన్యక పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు జరిగే యోగ శిబిరాన్ని మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ప్రారంభిస్తారని చెప్పారు. 21 రోజుల పాటు దీనిని నిర్వహించనున్నట్లు వివరించారు.

నిరుపయోగంగా ప్రభుత్వ వాహనాలు

ప్రజాధనం.. మట్టిపాలు

- శిథిలావస్థకు చేరి.. మట్టి కొట్టుకుపోయి ఉన్న జీపులు
- సంవత్సరాల తరబడి కార్యాలయాల ఆవరణలోనే

రేపల్లె రూరల్: ప్రజాధనం మట్టిపాలవుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల నిర్వహణలో భాగంగా క్షేత్ర పర్యటనలు నిర్వహించే సమయంలో వారి అవసరానికి గతంలో ప్రభుత్వం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. అధికారులు ఆయా వాహనాలను వినియోగించుకుని ప్రభుత్వ పనులపై పట్టణంలో, గ్రామాలలో పర్యటిస్తుండేవారు. ప్రభుత్వ వాహనాలుగా ఎక్కువగా జీపులను అధికారులు వినియోగిస్తుండేవారు. ఈ జీపు గ్రామంలోకి వస్తే ప్రభుత్వ అధికారులు వచ్చారని ప్రజలకు అర్థమయ్యేది. కాలక్రమంలో మార్కెట్‌లో నూతన వాహనాలు రావటంతో ఈ జీపులు స్థానంలో ఇతర వాహనాలను అధికారులు వినియోగిస్తున్నారు. కొంత మంది అధికారులు ప్రభుత్వం కేటాయించే నిధులతో లీజు పద్ధతిలో వాహనాలు వినియోగిస్తుండగా, మరికొంత మంది అధికారులు తమ వ్యక్తిగత వాహనాలనే వినియోగిస్తుండటంతో గతంలో వినియోగించిన జీపులు ఆయా కార్యాలయాల ఆవరణలో శిథిలమై కనిపిస్తున్నాయి. ప్రజాధనంతో అధికారుల వినియోగానికై ప్రభుత్వం కేటాయించిన జీపులు శిథిలమై నిరుపయోగంగా మారాయి. తహసీల్దార్, ఎంపీడీవో, ఇరిగేషన్, డ్రైనేజ్ తదితర శాఖల కార్యాలయాల ఆవరణలో ప్రస్తుతం ఆ జీపులు మట్టికొట్టుకు పోయి అధ్వాన పరిస్థితుల్లో ఉన్నాయి. సంవత్సరాల తరబడి కార్యాలయాల ముందు నిరుపయోగంగా ఉన్న వాహనాలను ఇప్పటికైనా అధికారులు విక్రయించి వచ్చే డబ్బులను ప్రభుత్వ ఖాతాలలో జమ చేయాలని ప్రజా సంఘాలు, ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో వాహనం


శిథిలమై చెత్త చెదారం నిండిన తహసీల్దార్ వాహనం


తుప్పపట్టి పాడైపోయిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వాహనం


ఖిలమైన పంచాయతీరాజ్ శాఖ అధికారుల వాహనం

సమష్టిగా ప్లాస్టిక్ కవర్లను నిషేధించుదాం

కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల: బాపట్ల మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేద్దామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మటన్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. మటన్ దుకాణాల యజమానులు తప్పనిసరిగా జంతు వధశాలలోనే వధించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మటన్, చికెన్ తప్పనిసరిగా స్టీల్ బాక్స్‌లు తెచ్చుకుని వాటిలో వేయించుకుని వెళ్లే విధంగా చూడాలని సూచించారు. అందరం కలిసి ప్లాస్టిక్‌ను నివారించేందుకు చర్యలు తీసుకుందామని తెలిపారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

రెవెన్యూ సదస్సులో రైతుల డిమాండ్


ఆలపాడు రెవెన్యూ సదస్సులో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

చుండూరు(వేమూరు): రైతులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ప్రశ్నించిన ఘటన చుండూరు మండలం ఆలపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో చోటు చేసుకుంది. రైతులు రెవెన్యూ సదస్సులో 4 అర్జీలు తహసీల్దారు నాగరాజుకు అందజేశారు. తహసీల్దారు నాగరాజు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. పొలం సర్వే కోసం ఒక దరఖాస్తు, ముగ్గురు రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలకు అర్జీలు అందజేశారని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరరావు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి

కర్లపాలెం: రైతుల సమస్యలు పరిష్కరించేందుకు గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ సుందరమ్మ అన్నారు. మండల పరిధిలోని ఏట్రవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతుల భూములకు సంబంధించిన సమస్యలను రైతుల సమక్షంలోనే పరిశీలించి పరిష్కరించేందుకు ఈ సదస్సులు దోహదపడతాయని చెప్పారు. భూములకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్‌లో పేరు మార్పు, సరిహద్దుల వివాదాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఈ సదస్సులో రైతుల నుంచి 4 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, సర్వేయర్ శ్రీరామమూర్తి, ఎండోమెంట్ అధికారి విజయ్, వీఆర్వో సాంబయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఏట్రవారిపాలెం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సుందరమ్మ

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. కర్లపాలెం పంచాయతీ ఇందిరానగర్ గ్రామంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు సందర్శించి ఆధార్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఉన్న విద్యార్థులలో ఆధార్‌కార్డులు లేని వారిని గుర్తించి వారికి ఆధార్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో ఇప్పటి వరకు 33 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.


ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో శ్రీనివాసరావు.

ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తగ్గించుకోవచ్చు

చింతమోటు(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించడమే కాక ఖర్చు తగ్గించుకోవచ్చునని మాస్టర్ ట్రైనర్ (ఎంటీ) నీలం ప్రకాష్ కుమార్ తెలిపారు. భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామంలో చందోలు సుశీల మినీ ఎన్‌పీఎం షాపులో బుధవారం అజ్ఞాస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ అజ్ఞాస్త్రం అన్ని రకాల పంటలలో వినియోగించవచ్చని చెప్పారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. రైతు సాధికారత సంస్థ ద్వారా జెడ్‌బీఎన్‌ఎఫ్ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ వంటి బహుళ లక్ష్యాలతో ఈ కార్యక్రమం ప్రారంభించబడిందని తెలిపారు. కృత్రిమ ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా.. గో మూత్రం, పేడ, వేపాకులు వంటి స్థానిక వనరులతో ఘన జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, అజ్ఞాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి తయారు చేసుకుని వినియోగించడం ద్వారా నేలలో జీవ పదార్థం అధికమవ్వడమే కాక భూసారం పెరుగుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మానవ ఆరోగ్యమే కాక నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. 20 లీటర్ల ఆవు మూత్రం, 10 లీటర్ల నీరు, 5 కిలోల వేపాకు, 5 కిలోల జిల్లేడు ఆకులు, 2 కిలోల వెల్లుల్లి, 3 కిలోల పచ్చిమిర్చితో ఈ అజ్ఞాస్త్రం తయారు చేశారు. ఎల్–2 సీహెచ్ సునీత, ఐసీఆర్పీలు పరిశ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.


అజ్ఞాస్త్రం తయారు చేస్తున్న దృశ్యం

అబాకస్ చాంపియన్‌గా అత్తోట హార్దీ

తెనాలి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగిన యూసీ మాస్ అబాకస్ పోటీల్లో తెనాలికి చెందిన అత్తోట హార్దీ రెండు స్థాయిల్లోనూ ఛాంపియన్‌గా నిలిచాడు. ఢిల్లీలోని ఢిల్లీ యూనివర్శిటీలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో ఆరువేల మంది పాల్గొన్నారు. విదేశీ కేటగిరీలో 30 దేశాలు పాల్గొన్నాయని, ఈ పోటీల్లో పాల్గొన్న హార్దీ లెవెల్–ఏ2లో రెండింటిలోనూ ఛాంపియన్‌గా సత్తా చాటినట్టు హార్దీ తండ్రి ప్రమోద్ బుధవారం సాయంత్రం ఇక్కడ తెలియజేశారు. స్థానిక అయితానగర్‌కు చెందిన హార్దీ, కొల్లూరులోని ఫోర్‌ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. అద్భుతమైన వేగం, ఖచ్చితత్వంతో సంక్లిష్టమైన అబాకస్ సమస్యలను పరిష్కరించి, తన నైపుణ్యాన్ని చాటినట్టు తెలిపారు. 15వ తేదీ సాయంత్రం కేంద్ర మంత్రి మీనాక్షి లేకి చేతులమీదుగా బహుమతులను అందుకున్నట్టు వివరించారు. మంగళవారం రాత్రి తెనాలి చేరుకున్న అబాకస్ బాలమేధావి హార్దీకి, రైల్వేస్టేషనులో కుటుంబసభ్యులు, బంధువులు ఘనంగా స్వాగతం పలికారు.


బహుమతులతో అత్తోట హార్దీ

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



కొల్లూరు : ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నిజాంపట్నం మండలం గరువుపాలెంకు చెందిన పాలెం ఏసుబాబు తన భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్లేందుకు తెనాలి వైపు నుంచి వస్తున్నాడు. అదే సమయంలో మండలంలోని పోతార్లంకకు చెందిన మరో ద్విచక్ర వాహనదారుడు కంచర్ల జాషువ ఎదురుగా వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఏసుబాబు వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో ఏసుబాబు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. జాషువ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రుణ్ణి 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

సీడీపీవో లక్ష్మీపార్వతి



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీడీపీవో లక్ష్మీపార్వతి చెప్పారు. పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని డ్వాక్రా కార్యాలయంలో కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో సీడీపీవో మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదువుకునే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. సమాజంలో బాలికలు, మహిళల పట్ల జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని చెప్పారు. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఎదుగుదల సక్రమంగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంఈవో వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

గంజాయి ఉందంటూ నగదు దోపిడీ

తెనాలిరూరల్: బ్యాగు తగిలించుకుని రోడ్డు వెంబడి నిలబడిన యువకుడి వద్దకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి అతని బ్యాగ్‌లో గంజాయి ఉందని, తనిఖీ చేయాలంటూ అతని నగదు అపహరించుకెళ్లిన ఘటన బుధవారం తెనాలిలో జరిగింది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఆళ్లమూడి గ్రామానికి చెందిన నాగసురేష్ తెనాలిలో వైద్య చికిత్స కోసం వచ్చాడు. ప్రకాశం రోడ్డులో పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు వెంబడి నిలబడి ఉండగా ఇతని వద్దకు బైక్‌పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చారు. బ్యాగులో గంజాయి ఉందని తమకు సమాచారం వచ్చిందని, తనిఖీ చేయాలని చెప్పడంతో బ్యాగు వారికి ఇచ్చాడు. బ్యాగులోని రూ. ఐదు వేలు తీసుకుని ఉడాయించారు. షాక్‌కు గురైన బాధితుడు తేరుకుని టూ టౌన్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాలు సకాలంలో తొలగించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో ఉత్పత్తి అయిన వ్యర్థాలను సకాలంలో తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని మార్కెట్ ఏరియా, గంగానమ్మపేటలలో బుధవారం తెల్లవారుజామున ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులు పరిశీలించారు. ప్రధాన రహదారులపై ఎక్కడ చెత్త లేకుండా చూడాలన్నారు. అలాగే శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అటెండెన్స్‌ను పరిశీలించారు. కార్మికులు అందరు ప్రతిరోజు విధులకు హాజరు కావాలన్నారు. చెత్త సేకరణపై అనేక ఫిర్యాదులొస్తున్నాయని, అవి రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులున్నారు.

కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు వహించాలి

ఎంపీడీవో శోభారాణి

రేపల్లె రూరల్: కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు వహించాలని ఎంపీడీవో ఎం.శోభారాణి చెప్పారు. కిశోర బాలికా వికాసంపై మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా సంరక్షణ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికా వికాశ దశలలో కిశోర ప్రాయం ఎంతో సున్నితమైందని ఈ దశలో ఎక్కువగా రక్తహీనత సమస్యను ఎదుర్కొంటారని, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అందించాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు కిశోర బాలికల ఆరోగ్యం, పోషణ, కౌమార వయస్సు పిల్లల పరిస్థితులు అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీడీపీవో సుచిత్ర వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో రత్నశ్రీధర్, హెచ్ఎం పద్మావతి, ఏపీఎం గోపి, ఎంపీహెచ్ఈవో వైవీ రావు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పీ పురుషోత్తం, ఉపాధ్యాయురాలు మాధవి, సీఆర్ఏఎఫ్ ఎన్జీవో శ్రీనివాస్, ఏబీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు అనురాధ, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో ఎం.శోభారాణి





పేరుకు పోయిన చెత్త.. కదలని మురుగు

భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి చిన్న మసీదు వద్ద చెత్త, చెదారం పేరుకుపోయి మురుగు కాల్వలో పడుతున్నప్పటికీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రతి నిత్యం రహదారులపై చెత్త, చెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు ఇదే రహదారిలో తరలిస్తున్నా సిబ్బందికి కనపడకపోవడం గమనార్హం. అలాగే మురుగు కాల్వలు పూడుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. వెంటనే చెత్త చెదారాన్ని, మురుగు కాల్వల పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిని పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి వెంటనే సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

–భట్టిప్రోలు

హాస్టల్ విద్యార్థులకు స్వెట్టర్ల పంపిణీ

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామంలో గల సంఘిక సంక్షేమ హాస్టల్ (1)ను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం రాత్రి తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థుల వసతులను పరిశీలించి ఆహారాన్ని రుచి చూశారు. విజిటర్స్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతకం చేశారు. చలికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల తహసీల్దార్ దృష్టికి వచ్చింది. దీంతో తనమిత్ర బృందమైన ఎన్జీవో సంఘ నాయకులు బి. కృష్ణమోహన్, కూనపెరెడ్డి శ్రీనివాసరావు తదితరులతో కలసి ఇదే విషయాన్ని పట్టణానికి చెందిన కాంట్రాక్టరు సూర్యదేవర భువన్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు సహాయం చేయాలని కోరారు. హాస్టల్ తనిఖీకి వెళ్లిన సందర్భంగా విద్యార్థులకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్లు, దిండ్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేసి, హాస్టలుకు ఫ్యాన్లు, లైట్లను సమకూర్చారు. వీటిని తనిఖీ సందర్భంగా వీరు అందజేశారు. రానున్న రోజుల్లో అన్ని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేస్తామని, అక్కడ ఉండే పేద విద్యార్థులకు తమమిత్ర బృందం, దాతల సాయంతో కనీస అవసరాలను కల్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా దాత భువన్‌ను సత్కరించి అభినందించారు.


విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, భువన్